క్లుప్తంగా

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

• సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు లక్ష్మి

దత్తిరాజేరు: ప్రజలకు పెనుభారంగా మారనున్న స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి అన్నారు. ఈ మేరకు ప్రజావేదిక ఆధ్వర్యంలో కోమటిపల్లి వద్ద గురువారం పలువురు కార్మికులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు స్మార్ట్‌మీటర్లను బద్దలు గొట్టాలని పిలుపునిచ్చిన లోకేశ్ ఇప్పుడు స్మార్ట్‌మీటర్లు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్లను రద్దు చేసే వరకు పోరాటం తప్పదన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాదకద్రవ్యాల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆశియ్య

చీపురుపల్లి రూరల్ (గరివిడి): మాదకద్రవ్యాలకు అలవాటు పడితే కుటుంబాలు, జీవితాలు నాశనమవుతాయని ఆర్డీఓ ఆశియ్య, డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. గరివిడి ఎస్‌డీఎస్ కళాశాలలో 'మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు'పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసలై ఎంతో మంది తమ విలువైన జీవితాలను కోల్పోయారన్నారు. విద్యార్థులు, యువత మంచి నడవడికను అలవరుచుకోవాలని సూచించారు. లక్ష్య సాధన కోసం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, సీఐ ఎస్.శంకరరావు, ఎస్సై బి.లోకేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీని వినియోగించాలి

• వ్యవసాయశాఖ ఏడీఏ నాగభూషణం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగభూషణం

గంట్యాడ: నానో యూరియా, నానో డీఏపీ వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని వ్యవసాయశాఖ ఏడీఏ నాగభూషణం తెలిపారు. మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా బెట్ట పరిస్థితుల్లో ఉన్న వరి నారుమడికి 19 – 19 – 19 ఐదు గ్రాములు, అగ్రోమిన్ 3 గ్రాములు చొప్పన లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు కె.గోవిందమ్మ, పి.నిర్మల, మండల వ్యవసాయాధికారి బి.శ్యామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



అప్పలరాజు దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలం కొండపాలెం మేజర్ పంచాయతీ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించి గురువారం ఉద్యోగ విరమణ చేసిన బక్క అప్పలరాజును పంచాయతీ కార్యాలయం ఆవరణలో సత్కరించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ పి.ప్రమీలకుమార్, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, వార్డు మెంబర్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బొబ్బిలిరూరల్: ఎస్సీ,ఎస్టీ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తహసీల్దార్ ఎం.శ్రీను హామీ ఇచ్చారు.మండలంలోని కింతలివానిపేటలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా మండల అధికారులు గ్రామంలో పర్యటించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు, కల్పించాల్సిన మౌలిక సదుపాయాల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఎస్సీ,ఎస్టీల హక్కులకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల అంశంలో రాజీలేదని, ఏ అంశమైనా నిర్భయంగా వెల్లడించాలని అన్నారు.అంటరానితనం,గ్రామబహిష్కరణలు తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ పి.రవికుమార్,ఆర్ఐ రామకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు..



జామి: అలమండలో బాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

• మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసానికి మారుపేరని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. మండలంలోని అలమండలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి కడుబండి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంతెంత నష్టపోయినదీ వివరించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామంటూ ప్రగల్భాలు పలికి, తీరా అధికారంలోకి వచ్చాక మాట మర్చాడని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చగా.. నేడు కూటమి ప్రభుత్వం హామీలను గాలికొదిలేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, ఎంపీపీ సబ్బవరపు అరుణ, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఫణిబాబు, సర్పంచ్ కోట పాపమ్మ, నేతలు లగుడు దేముడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు నిలదీయండి ..



గొల్లుపాలెంలో కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, నాయకులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి, గొల్లుపాలెం గ్రామాలలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఎన్నికల హామీలను నెరవేర్చని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్నికల హామీల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి రమణ, ఎం.చలంనాయుడు, పోతల కన్నంనాయుడు, గొల్లు సతీష్, కర్రోతు శ్రీనివాస్, తాళ్లపూడి అప్పలనాయుడు, సాలపు పెంటంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి



మదనాపురంలో కూటమి ప్రభుత్వం మోసాలను వివరిస్తున్న నరసింహమూర్తి, జైహింద్‌కుమార్, తదితరులు

గంట్యాడ: కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్ అన్నారు. మండలంలోని మదనాపురంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి సర్కార్ విఫలమైందని ఆరోపించారు. హామీలు అమలు చేయాలంటే ప్రజలు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, మండల ఉపాధ్యక్షుడు వర్రి మల్లయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి జాగారపు సత్యారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కె. విజయ్, ఉపాధ్యక్షుడు పొటుపురెడ్డి వెంకటరావు, పార్టీ నాయకులు గుల్లిపల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మోసాలు, అబద్ధాలే పెట్టుబడి..



కొట్యాడలో కూటమి ప్రభుత్వం నెరవేర్చని హామీలను వివరిస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, తదితరులు

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మోసాలు, అబద్ధాలే పెట్టుబడులని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ఆరోపించారు. మండలంలోని వీరభద్రపురం, కొట్యాడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయుకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడం వల్ల ఎంతెంత నష్టపోయినదీ వివరించారు. గతంలో జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతో పాటు మరిన్ని పథకాలు అమలు చేస్తామని తప్పుడు హామీలిచ్చి కూటమి నాయకులు అధికారంలోకి వచ్చారన్నారు. అనంతరం ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు హామీలిస్తారే తప్ప అమలు చేయరని ఎద్దేవా చేశారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అనడం సిగ్గుచేటన్నారు. హామీలిచ్చినప్పుడు ఆర్థిక పరిస్థితి తెలియదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కొట్యాడ సర్పంచ్ కొట్యాడ దేవీమహేష్, వైస్ సర్పంచ్ సతీష్, నాయకులు కొట్యాడ దేముడు, ఎంపీటీసీ సభ్యులు బొడ్డు గణపతి, యడ్ల కిశోర్, నాయుడు, మల్లివీడు సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున, పార్టీ నాయుకులు కొట్యాడ శ్రీనివాసరావు, తూర్పాటి అప్పలరాజు, గేదెల సూర్యనారాయణ, ఆవాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ

వేపాడ: మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఈ నెల నాలుగో తేదీన పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 5వతరగతిలో 45 సీట్లు.. 6వ తరగతిలో 7.. 7వ తరగతిలో 10.. 8 తరగతిలో 6.. 9వ తరగతిలో 19 .. 10వ తరగతిలో 18 .. ఇంటర్ మొదటి సంవత్సరంలో 8, ద్వితీయ సంవత్సరంలో ఐదు సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 95423 39722, 94913 31681 నంబర్లను సంప్రదించాలన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 3న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని నాగళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలోని జమ్ము, తోంద్రంగి, సదానందపురం, జమ్ముపేట, గొలగాం, తాటిపూడి, గిరిడ, వల్లాపురం, శేషపుపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదలకు అండగా సీపీఐ

భామిని: పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి పోరాటాలు చేస్తున్న వందేళ్ల సీపీఐ మహా సభలకు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జి జనార్దనరావు గురువారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 8, 9 తేదీలలో పాలకొండలో జరిగే జిల్లా మహాసభలకు విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలన్నారు. ప్రజలపై భారం మోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు. ఆ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిసీమల్లో కార్డెన్ సెర్చ్



పల్లపుదుంగాడలో కార్డెన్ సెర్చ్‌లో పోలీసులు

శృంగవరపుకోట: తూరుపు తెల్లారక ముందే ఎస్.కోటలో పోలీసు బలగాలు గురువారం ప్రత్యక్షమయ్యాయి. అటు జిందాల్ వ్యతిరేక నిరసనలు.. ఇటు ఎస్.కోటలో ఆక్రమణల తొలగింపులున్న నేపథ్యంలో పోలీసుల రాకతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కొద్దిసేపటికి పోలీసులు కార్డెన్ సెర్చ్‌కు వచ్చినట్లు తెలిసింది. డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్.కోట, కొత్తవలస, విజయనగరం రూరల్ సీఐలు నారాయణమూర్తి, షణ్ముఖరావు, బి.లక్ష్మణరావు, 16 మంది ఎస్సైలు, 85 మంది పోలీస్ కానిస్టేబుళ్లు గిరిజన గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ఇటీవల పల్లపుదుంగాడలో ఒక వ్యక్తి తన పినతండ్రిని నాటుతుపాకితో హత్య చేసిన నేపథ్యంతో ఇంటింటినీ జల్లెడ పట్టి నాటు తుపాకులు, ఆయుధాలపై ఆరా తీశారు. దారపర్తి పంచాయతీ పరిధిలోని మున్నపురాయి, రాయపాలెం, చప్పవాని గెడ్డ, పల్లపుదుంగాడ, రంగవలస, పాత శనగపాడు, కొత్త శనగపాడు, దబ్బగుంట.. మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో లక్ష్మీపురం, బొడ్డపాడు, చిలకపాడు, చిట్టింపాడు, గూనపాడు, తదితర గ్రామాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులు అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నా.. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. సెర్చ్ ఆపరేషన్‌లో విజయనగరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్, తెర్లాం, పూసపాటిరేగ, సంతకవిటి, వల్లంపూడి, బొండపల్లి స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

• మోసపోయాం..



జిందాల్‌కు భూములు అమ్మి మోసపోయామని నిర్వాసితులు ఆరోపించారు. ఈమేరకు ప్లకార్డులు చేతబూని బొడ్డవర జంక్షన్‌లో గురువారం నిరసన చేపట్టారు.

– శృంగవరపుకోట

దోమల నివారణకు విస్తృతచర్యలు



డ్రోన్ ద్వారా ద్రావణం పిచికారీని పరిశీలిస్తున్న పీవో

సీతంపేట: దోమల నివారణ చర్యలు విస్తృతంగా చేపట్టాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దూరు, నాగూడ గ్రామాల పరిధిలో ఉన్న చెరువుల్లో దోమల లార్వాను నివారించే ఫ్లోరో బెంజీరాన్ ద్రావణాన్ని మలేరియా నివారణ శాఖ ఆధ్వర్యంలో పిచికారీ చేశారు. డ్రోన్ ద్వారా చెరువుల్లో పిచికారీ చేయించడాన్ని పీవో పరిశీలించారు. దోమల నివారణ చర్యలపై పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంవో పీవీ సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు, కన్సల్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

20 మందిపై బైండోవర్ కేసులు



బైండోవర్ చేసిన వారిని తహసీల్దార్ ఎదుట హాజరు పర్చిన ఎస్‌ఐ

సీతంపేట: మండలంలోని సారా విక్రయించిన వారు, అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులు, వండిన వారు మొత్తం 20 మందిపై గురువారం బైండోవర్ కేసులు పెట్టినట్లు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. వీరిని తహసీల్దార్ ఎదుట గురువారం హాజరు పర్చినట్లు తెలిపారు. మళ్లీ సారాకు సంబంధించిన కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

• ఎట్టకేలకు స్పందించిన అధికారులు
• ఆనందం వ్యక్తం చేస్తున్న ఎస్.కోట పట్టణ వాసులు



ఎస్.కోట మెయిన్‌రోడ్‌లో తొలగింపులను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట:

ఏళ్ల నాటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దొరికింది. ఎస్.కోట పట్టణ ప్రధాన సమస్యకు చెక్ చెప్పేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. రెవెన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, పీఆర్, పంచాయతీ అధికారులంతా గురువారం తెల్లవారుజామునే ఎస్.కోట మెయిన్‌రోడ్డుకు చేరుకుని ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. 516బి జాతీయ రహదారిగా గుర్తింపు పొందిన విశాఖ – అరుకు రహదారి ఎస్.కోట పట్టణంలో మాత్రం పరువుపోయేలా తయారైంది. వర్షం కురిసిన ప్రతిసారీ మోకాలి లోతున మురుగునీరు ప్రధాన రహదారిపై నిల్వ ఉంటోంది. దీంతో పట్టణ వాసులు, వాహన చోదకులు నరకం చూసేవారు. ఆక్రమణలను తొలగిస్తే మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు భావించారు. ఈ క్రమంలో తహసీల్దార్ డి.శ్రీనివాసరావు ముందుగానే ఆక్రమణదారులకు, దుకాణాల యజమానులకు నోటీసులు పంపి సహకరించాలని కోరారు. దేవీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు ఉన్న ఆక్రమణలు తొలగించే పనులు గురువారం ప్రారంభించారు.

ఇదిలా ఉంటే కొంతమంది దుకాణదారులు మాత్రం తమ రాజకీయ పలుకుబడితో తొలగింపుల నుంచి మినహాయింపు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయం తహసీల్దార్ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా, ప్రధాన రహదారికి ఇరువైపులా ఆర్‌అండ్‌బీ, పీఆర్ అధికారులు మార్కింగ్ ఇచ్చారన్నారు. మార్కింగ్ ప్రకారం స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవడం మంచిదని.. తీయని పక్షంలో తామే తొలగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ మనోజ్, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఆర్‌అండ్‌బీ, పీఆర్ జేఈలు సురేష్. సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ లక్ష్మి, పంచాయతీ ఈఓ అనురాధ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఏఎస్సై గోవిందరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఫేకర్ కూల్చివేతను అడ్డుకోండి..

చీపురుపల్లి రూరల్ (గరివిడి):



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఫేకర్ కార్మికులు

జిల్లాకే తలమానికంగా ఉన్న గరివిడి ఫేకర్ పరిశ్రమను యాజమాన్యం కూల్చేస్తోందని.. వెంటనే వాటిని ఆపాలని పలువురు కార్మికులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పరిశ్రమ కూల్చివేస్తే మా పరిస్థితేమిటని ప్రశ్నించారు. 2023 నవంబర్‌లో 100 శాతం లే ఆఫ్ విధించారన్నారు. అలాగే విద్యుత్ చార్జీలు పెరిగాయని ఒకసారి.. ముడిసరుకు రేట్లు పెరిగాయని మరోసారి.. ఇలా లేనిపోని కారణాలతో పరిశ్రమను మూసివేశారని చెప్పారు. ఇటువంటి కంపెనీలే చుట్టుపక్కల కొనసాగుతుండగా.. ఒక్క గరివిడి ఫేకర్ పరిశ్రమనే ఎందుకు నడపలేకపోతున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకుండా.. కార్మికులతో సంప్రదింపులు చేయకుండా.. కార్మికుల జీవితాలకు భరోసా ఇవ్వకుండా ఫేకర్ పరిశ్రమను కూల్చివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమలో 30 ఏళ్లకు పైబడి సర్వీస్ పూర్తి చేసుకున్న వారు సైతం ప్రస్తుతం వలసపోయే పరిస్థితి నెలకొందన్నారు. పరిశ్రమ కూల్చివేతను నిలిపివేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

బొబ్బిలి: మాదకద్రవ్యాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని సీఐ కె. సతీష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని గొల్లపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆదేశాల మేరకు సంకల్ప రథం నుంచి షార్ట్‌ఫిల్మ్ ప్రదర్శించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.